# వలిగొండ మండల కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన వర్షం తడిసి ముద్దయిన వరి ధాన్యం



**వలిగొండ మే 5 (వార్తా వేకువ) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో శుక్రవారం రోజు మధ్యాహ్నం ఈదురు గాలిలతో కూడిన వర్షానికి వలిగొండ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం లో ఆరబోసి కుప్ప వేసిన ధాన్యం తడిసి ముద్దయింది మరియు బస్తాలలో నింపిన ధాన్యం కూడా గాలివానకు పరదాలు లేచిపోవడంతో ధాన్యం తడిసి రైతులు ఎంతో బాధపడుతున్నారు ఆరుకాలం పండించిన పంట కళ్ళముందే వర్షానికి ముద్దా అవ్వగా బోరున విలపించ నారు వెంటనే ప్రభుత్వం స్పందించి వడ్లను కొనుగోలు చేసి రైతులను కాపాడవలసిందిగా కోరుచున్నారు

# పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటకం

## - శ్రీ చక్ర కాలనీలో రూ.25.30 లక్షల సీసీ రోడ్ల పనులకు శ్రీకారం



**కాప్రా, జూన్ 5 (వార్తా వేకువ) :** కాప్రా డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎల్ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలో శుక్రవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి పౌరుడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని స్వర్ణరాజ్ శివమణి పిలుపునిచ్చారు. అనంతరం డివిజన్ పరిధిలోని శ్రీ చక్ర కాలనీలో రూ. 25.30 లక్షల నిధులతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చక్ర కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. భూమిపూజ అనంతరం మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో కాప్రా డివిజన్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, గతంలో తాను కార్పొరేటర్‌గా పనిచేసిన కాలంలోనూ, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ హయాంలోనూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శ్రీ చక్ర కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రజా ప్రభుత్వానికి, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొబ్బనూరి నాగ శేషు, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్ పూర్ణ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, జి. సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, వినయ్, మనోజ్ కుమార్, యూబీడీ వింగ్ ఫీల్డ్ అసిస్టెంట్ జి. అజయ్ కుమార్, జార్జ్ పెలెక్స్, డా. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రావి మొక్క నాటిన సామాజిక సేవ కార్యకర్త ఏ. మంగీలాల్



**భద్రాద్రి జిల్లా జూన్ 5 (వార్తా వేకువ) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మణుగూరు ఏరియా సివిల్, సింగరేణి, రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త ఏ. మంగీలాల్ రావి మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ,"మానవ మనుగడకు స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం ప్రకృతి నుంచే లభిస్తాయి. ప్రకృతే మన జీవనాధారం. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, విచ్చలవిడి ప్లాస్టిక్ వాడకం వల్ల భూతాపం, వాతావరణ మార్పులు తీవ్రమవుతున్నాయి. వీటిని అరికట్టడం తక్షణ అవసరం" అని అన్నారు."ప్రకృతిని కాపాడుకోవడం అంటే మనల్ని మనం రక్షించుకోవడమే. 'పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత' అనే నినాదంతో భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే మన లక్ష్యం కావాలి. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, విరివిగా మొక్కలు నాటాలి. కేవలం మొక్కలు నాటడమే కాక, వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలి" అని రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల తరపున ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రైల్వే సైడింగ్ కాంట్రాక్ట్ కార్మికులు కె. గురుమూర్తి, జి. నాగేశ్వరరావు, యు. శివరామకృష్ణ, ఎం. సాంబశివరావు, కె. నాగరాజు, ఈ. పవన్ కుమార్, జి. శ్రీనివాసరావు, కె. సంపత్ కుమార్, ఎం. గురు ప్రసాద్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన బీజేపీ నాయకులు





**కాప్రా, జూన్ 5 (వార్తా వేకువ) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడిచర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో ఉన్న శ్రీ స్వామి వివేకానంద విగ్రహం సమీపంలోని పార్కులో, అలాగే కాటమయ్య భవన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు, డి .నాదం జిల్లా బీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రేగొండ వెంకటేశ్వర్లు, ఉప్పల్ అసెంబ్లీ మీడియా సెల్ కన్వీనర్ టి. ఆనంద్ గౌడ్, డివిజన్ ఉపాధ్యక్షుడు ఎన్. జనార్దన్, శంకర్, వంశరాజ్, మోర్చా అధ్యక్షుడు దయానంద్, నాయకులు గణేష్ గౌడ్, రాజు ముదిరాజ్, రాజేష్, వంశరాజ్, చందం శ్రీకాంత్, సహదేవ్ గౌడ్, మహిళా నాయకురాళ్లు జ్యోతి రెడ్డి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# సర్టిఫికెట్ల,కోసం,విద్యార్థులు, ప్రజలు, ఎలాంటి ఇబ్బందులు పడేది లేదు

## తహశీల్దార్ సూర్యప్రకాశ్



**భద్రాద్రి జిల్లా జూన్ 5 (వార్తా వేకువ) :** అశ్వాపురం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహశీల్దార్, మాట్లాడుతూ ప్రజలకు అందించే రెవెన్యూ సేవలపై పలు కీలక విషయాలను వెల్లడించారు. విద్యార్థుల, సర్టిఫికెట్ల కోసం, ప్రజల యొక్క అవసరాల నిమిత్తం కొరకు కార్యాలయం చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరం లేదని, అన్నారు. కార్యాలయంలో సర్టిఫికెట్ల విషయం నందు ఏవైనా జాప్యం జరిగినట్లయితే,లేదా సమస్యలు ఉన్న నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా సేవలు అందించడమే తమ లక్ష్యమని సూర్య ప్రకాష్, తెలిపారు, దరఖాస్తుల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామని ఆయన చెప్పారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా తహశీల్దార్,కార్యాలయంలో,అందుబాటులో ఉన్న అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు, దరఖాస్తుల పరిష్కార విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, యూడిసి, గ్రామ పంచాయతీల జీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు గంటల పని ఎండలో కష్టం.. చేతిలో వేతనం రూ.130/ ఏ నా ?

## ఉపాధి హామీ కూలీలు ఆగ్రహం



**భద్రాద్రి జిల్లా జూన్ 5 (వార్తా వేకువ) :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని,మోతేపట్టినగర్,గ్రామంలో,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు తమకు సరైన వేతనాలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, సుమారు ఐదు గంటలపాటు ఎండలో శ్రమించినప్పటికీ కేవలం రూ.130 మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం వేతనం రోజువారీగా సరైన గిట్టుబాటు కల్పించాలని, డిమాండ్ చేశారు, గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం క్షేత్రస్థాయిలో లక్ష్యాలకు విరుద్ధంగా సాగుతోందని కూలీలు ఆరోపిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కుటుంబ పోషణ భారం మధ్య రోజంతా శ్రమించి కూడా తగిన వేతనం అందకపోవడం తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. అంతేకాకుండా పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం పట్ల కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండల్లో పని చేస్తున్నప్పటికీ తాగేందుకు మంచినీరు అందుబాటులో ఉంచడం లేదని, విశ్రాంతి తీసుకునేందుకు నీడ సదుపాయం కూడా కల్పించడం లేదని ఆరోపించారు. వృద్ధులు, మహిళలు, బాలింతలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని తెలిపారు. "ఉదయం నుంచి ఎండలో కష్టపడి పనిచేస్తున్నాం. కానీ మా శ్రమకు తగిన వేతనం రావడం లేదు. తాగడానికి నీళ్లు కూడా లేవు. కనీస మానవతా దృక్పథంతోనైనా అధికారులు స్పందించాలి" అని పలువురు కూలీలు వాపోయారు. పని పరిమాణానికి అనుగుణంగా వేతనాలు చెల్లించడం లేదని, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని వారు ఆరోపించారు. తమ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. కూలీల ఆందోళనతో కొంతసేపు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, కూలీలకు న్యాయం చేయడంతో పాటు పనిస్థలాల్లో తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు వంటి కనీస వసతులు కల్పించాలని గ్రామస్తులు, కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

# బూర్గంపాడు లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## ఐటీసీ ఎంఎస్‌కే, ప్రథమ్, బంధన్ సంస్థల ఆధ్వర్యంలో



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు జూన్ 5 (వార్తా వేకువ) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలో ఐటీసీ ఎంఎస్‌కే స్వచ్ఛంద సంస్థ, ప్రథమ్ మరియు బంధన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు అంకితమైన విస్తృత కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించింది. ఉదయం నుంచే గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ సమీప ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్తులు భారీ ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేసి, వాటిని నాటడంతో పాటు సంరక్షించాలని సూచించారు. గ్రామంలోని ప్రధాన రహదారుల ఇరువైపులా వందలాది మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బూర్గంపాడు గ్రామ సర్పంచ్ మంద నాగరాజు మాట్లాడుతూ, ఒక్కో వ్యక్తి ఒక మొక్క నాటి దానిని సంరక్షిస్తే గ్రామం పచ్చదనంతో కళకళలాడుతుంది. చెట్లు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. రానున్న తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే గ్రామాభివృద్ధి అనేది కేవలం రహదారులు, భవనాల నిర్మాణంతోనే కాకుండా పర్యావరణ పరిరక్షణతో కూడి ఉండాలని, చెట్ల పెంపకం ప్రతి కుటుంబం తమ బాధ్యతగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఐటీసీ ఎంఎస్‌కే, ప్రథమ్, బంధన్ సంస్థల ప్రతినిధులను గ్రామ ప్రజలు అభినందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం వారు చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాగ మురళి, శనగ కిరణ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు.

ఒక మొక్క- ఒక ప్రాణం; ఒక చెట్టు- ఒక భవిష్యత్తు

పర్యావరణాన్ని కాపాడుదాం -- భావితరాలకు భద్రమైన భూమిని అందిద్దాం.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మానవహారం



**కాప్రా, జూన్ 5 (వార్తా వేకువ) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం సౌత్ కమలానగర్ కూడలిలో పోస్టర్లతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు సమన్వయం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారు పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సామాజిక ఉద్యమ నాయకుడు కోమటి రవి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సంక్షోభానికి పాలకుల విధానాలే ప్రధాన కారణమని విమర్శించారు. పట్టణీకరణ పేరుతో కోట్లాది చెట్లను నరికివేస్తుండటంతో భవిష్యత్ తరాల జీవనానికి ముప్పు వాటిల్లుతోందని అన్నారు. అడవులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ గనుల తవ్వకాల కోసం విస్తృత స్థాయిలో అటవీ విధ్వంసం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో అంతర్జాతీయ సంస్థలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలందరూ చైతన్యవంతులై ఉద్యమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ వాగ్గేయకారుడు జయరాజు రచించిన చెట్టుపై పాటను ఐద్వా నాయకురాలు, మాజీ కౌన్సిలర్ చల్లా లీలావతి తన బృందంతో కలిసి ఆలపించారు. ఈ గీతం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమన్వయకర్త గౌడుగు యాదగిరిరావు మాట్లాడుతూ పర్యావరణ విధ్వంసానికి అసలు కారణాలను దాచిపెట్టి ప్రజలపై బాధ్యత నెట్టివేసే ధోరణిని పాలకులు విడనాడాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ తయారీ, వినియోగాన్ని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జయరాజు, యాదయ్య, శివన్నారాయణ, బాబురావు, శారద, రహీం, చల్లా లీలావతి, ఎం. భాస్కర్‌రావు, జి. శివరామకృష్ణ తదితరులు ప్రసంగించారు. అనంతరం నినాదాలతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, పార్థసారథి, ఉమామహేశ్వరరావు, ఎన్. శ్రీనివాస్, ఎం. శ్రీనివాసరావు, శోభ, గౌసియా, శారద, భాస్కర్‌రావు, యాదయ్య, శివన్నారాయణ, జయ రాజు, రహీం, బాబురావు, కోమటి రవి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత ఐటీడీఏ పీవో రాహుల్‌ను సన్మానించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**భద్రాద్రి జిల్లా జూన్ 5 (వార్తా వేకువ) :** గిరిజన సంక్షేమం, అభివృద్ధి మరియు సుపరిపాలనలో విశేష కృషి చేసి కేంద్ర ప్రభుత్వం నుండి జాతీయ స్థాయిలో "ఉత్తమ ప్రాజెక్టు అధికారి" అవార్డును అందుకున్న భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ని, శుక్రవారం, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు,పాయం వెంకటేశ్వర్లు, ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిష్టాత్మక అవార్డును అందుకుని, భద్రాచలం పట్టణ కేంద్రానికి తిరిగి వచ్చిన రాహుల్ ని ఈ సందర్భంగా, ఐటీడీఏ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా,కలిసి,అభినందించి,శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, జ్ఞాపికను అందజేసి ఘనంగా, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధి, విద్య, ఉపాధి, జీవనోపాధి మెరుగుదల కోసం ఐటీడీఏ పీవో రాహుల్ చేపట్టిన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. భద్రాచలం ఐటీడీఏకు జాతీయ స్థాయిలో ఈ అవార్డు రావడం ఏజెన్సీ ప్రాంత ప్రజలందరికీ గౌరవప్రదమైన విషయమని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి పరిరక్షణకు గిరిజన మ్యూజియం ఏర్పాటు, భద్రగిరి మార్ట్ ద్వారా గిరిజన మహిళలు, రైతులకు మార్కెటింగ్ అవకాశాలు,ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు,గిరిజన గోత్రాల చరిత్ర సేకరణ, క్రీడల ప్రోత్సాహం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి కార్యక్రమాలు ఈ అవార్డుకు ప్రధాన కారణమయ్యాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొనియాడారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమం కోసం తాము చేస్తున్న కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో అవార్డు ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. పీవో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు ఉప సర్పంచ్ గుండె వెంకన్న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి,ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భజన ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ అధికారులు మరియు ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన సర్పంచ్, ఉప సర్పంచ్,లు



**భద్రాద్రి జిల్లా జూన్ 5 (వార్తా వేకువ) :** మణుగూరు పట్టణ కేంద్రంలోని సమితి సింగారం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, గ్రామపంచాయతీ కార్యాలయం, ఆవరణలో మొక్కలు నాటిన. సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, ఈ కార్యక్రమంలో, వార్డు సభ్యులు బర్మావత్ నరసింహారావు, కోలపిన్ని మానస, బోడ బీరమ్మ, మాదాడి రాజేష్, వేల్పుల నరేష్, వాంకుడోత్ నాగేంద్రబాబు, ఎదలపల్లి శారద, పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 8 న మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో నేషనల్ అప్రెంటిస్ మేళా..



**భద్రాద్రి జిల్లా జూన్ 5 (వార్తా వేకువ) :** ఐటీఐ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూన్ 8న మణుగూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి. వెంకటేశ్వరరావు, విలేకరుల సమావేశంలో తెలిపారు. సందర్భంగా ప్రిన్సిపాల్, మాట్లాడుతూ,హైదరాబాద్‌కు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు హాజరై అప్రెంటిస్ అవకాశాలు కల్పించనున్నారు. అన్ని ట్రేడ్లలో ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు: 7981521746, 9989637594. ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

